ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
గురువారం 9 జనవరి 2025



న్యూస్ బాక్స్

వైద్య బృందానికి కలెక్టర్ అభినందనలు

పెద్దపల్లిటౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): క్లిష్టమైన సర్జరీని విజయవంతంగా జిల్లా ఆసుపత్రిలో నిర్వహించినందుకు వైద్య బృందాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందిస్తూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూలపల్లి మండలం వెంకట్రావుపల్లికి చెందిన 45 సంవత్సరాల మహిళ మూడేళ్లు గర్భసంచిలో పెద్దగడ్డలతో బాధపడిందని, ప్రభుత్వ ఆసుపత్రికి స్థానిక ఎమ్మెల్యే సిఫార్సు చేశారన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ పర్యవేక్షణలో వైద్యబృందం విజయవంతంగా ఆపరేషన్ చేసి దాదాపు కేజీన్నర యూటిరైన్ ఫాబ్రియార్డ్ ద్వారా 2గడ్డలు, గర్భ సంచిని తొలగించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళకు విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించిన వైద్యులు డాక్టర్ అనసూయ, డాక్టర్ శౌర్య, డాక్టర్ శ్రీధర్‌లను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా ఆసుపత్రిలో గర్భసంచి సమస్యలకు సంబంధించి శస్త్రచికిత్సలు విజయవంతంగా జరుగుతున్నాయని, అవసరమైన ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

నేడు ఉచిత కంటి శిబిరం

ధర్మారం జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందిమేడారంలో గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు తలమక్కి రవీందర్ శెట్టి తెలిపారు. లయన్స్ క్లబ్, రేకుర్తి కంటి హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ శిబిరం గ్రామంలోని రైతు వేదిక వద్ద ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగుతుందన్నారు. శిబిరంలో పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమైతే రేకుర్తి కంటి హాస్పిటలో ఉచిత ఆపరేషన్‌తో పాటు ఉచిత బస్సు సౌకర్య కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు వాహనాల వేలం

కోల్‌సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఎక్సైజ్‌స్టేషన్ ఆవరణలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను గురువారం వేలం వేయనున్నట్టు ఇన్‌స్పెక్టర్ మంగమ్మ పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనే ఆసక్తిగల వారు ఉదయం 9.30 గంటలకు రామగుండం ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

బీజేపీలో సంస్థాగత సందడి

- మండల, జిల్లా కమిటీల అధ్యక్షుల ఎంపికకు కసరత్తు
- నియామకాలపై కార్యకర్తల్లో ఉత్కంఠ



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

భారతీయ జనతా పార్టీలో సంస్థాగత ఎన్నికల సందడి నెలకొన్నది. సభ్యత్వ నమోదు పూర్తి కావడంతో పాటు బూత్, మండల, జిల్లా అధ్యక్షుల నియామకాల కోసం కసరత్తు జరుగుతున్నది. అయితే నేతలందరినీ సమన్వయపరిచి మండల, మున్సిపల్, జిల్లా అధ్యక్షులను ఏ విధంగా ఎంపిక చేస్తారనే విషయమై కార్యకర్తల్లో ఉత్కంఠ నెలకొన్నది. సంస్థాగత ఎన్నికలు జరిగి మూడేళ్లు గడుస్తుండడంతో కొత్త కమిటీల నియామకాల ప్రక్రియను చేపట్టారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎనిమిది నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులు గెలుపొందగా, ఏప్రిల్ నెలలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 8 స్థానాల్లో ఎంపీ అభ్యర్థులు గెలుపొందారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ రెండో స్థానంలో ఓట్లు సాధించడం విశేషం.

దీంతో ఒకటి, రెండు నెలల్లో జరగనున్న గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు, ఆ తర్వాత సహకార సంఘాల ఎన్నికలు, మున్సిపాలిటీ, మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ భావిస్తున్నది. ఇందుకోసం క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఐదు మాసాల నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. సభ్యత్వ కార్యక్రమం డిసెంబర్‌లో పూర్తికాగా, బూత్, గ్రామ కమిటీలు దాదాపుగా పూర్తికావస్తోంది. మండల, జిల్లా కమిటీల అధ్యక్షుల కోసం పార్టీ పరిశీలకులు, జిల్లా ఇన్‌చార్జీలు ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన నాయకులను మండల, మున్సిపల్ కమిటీ అధ్యక్షులుగా నియమించాలని భావిస్తున్నారు.

నేతల మధ్య సమన్వయం కరువు..

జిల్లాలో బీజేపీ మరింత బలోపేతం కావడానికి అవకాశాలు ఉన్నప్పటికీ, ఆయా నియోజకవర్గాల్లో గ్రూపుల కారణంగా పార్టీ బలోపేతం కావడం లేదనే విమర్శలున్నాయి. పెద్దపల్లి నియోజకవర్గంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి వర్గాల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొన్నది. ఈ రెండు గ్రూపులను సమన్వయం చేయడంలో రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకత్వం విఫలమైంది. ఇటీవల పెద్దపల్లిలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర పరిశీలకులు రాగా, గుజ్జుల రామకృష్ణారెడ్డి వర్గానికి చెందిన నాయకులు కింద కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఎన్నోఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న తమను పార్టీ జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి పట్టించుకోవడం లేదని నిరసన వ్యక్తం చేశారు. మంథని నియోజకవర్గం మారుమూల ప్రాంతం కావడంతో అక్కడ వర్గపోరు లేదు. రామగుండం నియోజకవర్గంలోనూ పార్టీ నాయకులంతా ఒక తాటిపైన లేకపోగా, ఎవరికి వారుగా వర్గాలుగా విడిపోయి ఉన్నారు. రాష్ట్ర పార్టీ ఇచ్చే పిలుపు మేరకు పెద్దగా కార్యక్రమాలు జరగడం లేదు. నియోజకవర్గ ఇన్‌చార్జీ కందుల సంధ్యారాణి అడపాదడపా కొన్ని కార్యక్రమాలు చేస్తుండడం పార్టీ శ్రేణులకు కొంత ఊరట కల్పిస్తున్నప్పటికీ, నియోజకవర్గ పరిధిలో పార్టీ నాయకులందరితో సమన్వయం లేని కారణంగా ఎవరికి వారే

మిగతా 8వ పేజీలో..

ఆదర్శవంతంగా గ్రామాల అభివృద్ధికి కృషి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



పొత్కపల్లిలో పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు 8

సంక్రాంతి పిండి వంటల హోమ్ డెలివరీ..

- ఆర్టీసీ కార్గో సెంటర్లను పరిశీలించిన అధికారులు



గోదావరిఖని బస్టాండ్‌లో కార్గో కౌంటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు 8

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చేయూత..

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చేయూతనందిస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు స్వంత ఖర్చులతో 45 రోజుల పాటు ఉచితంగా మధ్యాహ్న భోజనాన్ని అందించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామాల నుంచి వచ్చి కళాశాలలో చదువుకునే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా చర్యలు తీసుకుంటానన్నారు. అదే కాలేజీలో చదువుకున్న తాను ఎమ్మెల్యేగా ఎదగడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, ఏఎంసీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, వైస్‌చైర్‌పర్సన్ బిరుదు సమతక్రిష్ణ, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, వైశ్య సంఘం అధ్యక్షులు కొమురవెల్లి రాంమూర్తి, భాస్కర్, ప్రిన్సిపాల్, అధ్యాపకులుతదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి సంపూర్ణ సహకారం

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



దివ్యాంగులకు ఉపకరణాలు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల అభ్యున్నతికి సంపూర్ణ సహకారం అందజేస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుతో కలిసి కలెక్టర్ అలింకో సంస్థ నిర్వహించిన క్యాంపులో దివ్యాంగులకు 27 లక్షల రూపాయల ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత నవంబర్‌లో అలింకో సంస్థ ద్వారా క్యాంప్ నిర్వహించి పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో అర్హులైన దివ్యాంగులను ఎంపిక చేశామన్నారు. రాబోయే 2 నెలల వ్యవధిలో మరొకసారి క్యాంపు నిర్వహించి ఇంకా ఎవరైనా ఉంటే వారికి పరికరాల పంపిణీకి చర్యలు చేపడతామని తెలిపారు. ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటున్నాయని, దీనికి కృషి చేసిన కలెక్టర్‌కు, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి సహకారంతో జిల్లా ఆసుపత్రిని వంద పడకలకు విస్తరిస్తున్నామని, నెలాఖరు నాటికి టెండర్ పూర్తిచేసి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాలరావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

కాల్వశ్రీరాంపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఈనెల 9న సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామ్మోహన్‌చారి తెలిపారు. మండలంలోని అన్నిగ్రామాల్లో గత సంవత్సరం డిసెంబరు 28 నుంచి ఈనెల 8వరకు ఉపాధిహామీలో భాగంగా చేసిన పనులు, కూలీల వివరాలపై 14వ సామాజిక తనిఖీ వివరాల నివేదిక ప్రకటించే విషయమై సమావేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.

స్వశక్తి మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు..

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

పెద్దపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్వశక్తి మహిళా సంఘాల ద్వారా వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం ఉపముఖ్యమంత్రి ప్రజా భవన్ నుంచి మంత్రులు సీతక్క, కొండ సురేఖ, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్, సెర్ప్‌సీఈవో దివ్యదేవరాజన్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్‌తో కలిసి మహిళా సంఘాల ద్వారా సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తేనే వారి ఎదుగుదలకు అవకాశాలు ఏర్పడతాయన్నారు. రానున్న కొత్త విద్యుత్ పాలసీ నేపథ్యంలో ఇంధన, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య గత సంవత్సరం నవంబర్ 19న కుదిరిన ఒప్పందాన్ని జిల్లా కలెక్టర్లు ఉపయోగించుకుని ముందుకువెళ్లాలని సూచించారు. ఐదు సంవత్సరాలలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ క్రమంలో మహిళలకు పెద్దఎత్తున వడ్డీలేని రుణాలు అందుబాటులోకి తెస్తున్నామని, వారు వ్యాపారాలు చేసుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధంచేసి వసతులు కల్పించాలని ఆదేశించారు. మహిళా సంఘాలు సోలార్ పవర్‌ప్లాంట్‌ల ఏర్పాటుకు వారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. మహిళా సంఘాల భూముల్లో ప్లాంట్‌లో ఏర్పాటుకు విద్యుత్ శాఖ రెడ్కో ద్వారా టెండర్లు ఆహ్వానించిందని, త్వరలో టెండర్లు ఓపెన్ చేసి వాటిని ఖరారుచేస్తారని వెల్లడించారు. జిల్లాల్లో ఆసక్తిగల మహిళా సంఘాలను గుర్తించి నిర్ధారించడం, భూసేకరణ, బ్యాంకుల నుంచి ఆర్థిక సాయం వంటి పనులను గ్రామీణ అభివృద్ధి శాఖ, కలెక్టర్లు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఒక మెగావాట్ ఉత్పత్తికి నాలుగు ఎకరాలు అవసరం ఉంటుందని, ప్రతి జిల్లాలో 150ఎకరాలకు తగ్గకుండా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు నాలుగు వేల ఎకరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. దేవాదాయ, ఇరిగేషన్ శాఖల పరిధిలోని భూములను గుర్తించాలని, కేంద్ర అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులు భూమి అభివృద్ధిచేసుకునే అవకాశం ఏర్పడిందన్నారు. అటవీప్రాంతాల్లో భూములపై హక్కులు ఏర్పడినప్పటికీ స్తంభాలు వేసి విద్యుత్ లైన్‌ల ద్వారా విద్యుత్ సౌకర్యం ఏర్పాటుచేసే క్రమంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, సోలార్ పవర్‌ప్లాంట్లను ఏర్పాటు చేస్తే ఎవరికి ఇబ్బంది ఉండదన్నారు. ప్రధానమంత్రి కుసుమ్ పథకంలో భాగంగా రైతులు రెండు మెగావాట్ల వరకు సోలార్ పవర్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఏర్పడిందని, ఈదిశగా రైతులను చైతన్యపరచాలన్నారు. తెలంగాణ రెడ్కో పోర్టల్ ద్వారా రైతులు సోలార్ పవర్ ఉత్పత్తికి దరఖాస్తులు చేసుకోవాల్సి ఉందని, దీనిద్వారా తక్కువ ధరకు విద్యుత్తు అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో ఎం కాళిందిని, జిల్లా అటవీ అధికారి శివయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తుల నమోదుకు చర్యలు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విద్యార్థులు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం త్వరగా దరఖాస్తు చేసుకునే విధంగా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులు, హాస్టల్స్ మరమ్మతు పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ తదితర కళాశాల్లో విద్యార్థుల పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలను త్వరగా తప్పనిసరిగా దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులను పూర్తిస్థాయిలో వెంటనే సమర్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, గత సంవత్సరం కంటే 20శాతం అదనంగా దరఖాస్తులు నమోదు కావాలని సూచించారు. వివిధ రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్ లో చేపట్టిన మరమ్మతు పనులను ఈఈ పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రజల అవసరాలకు ఉచితంగా ఇసుక : కలెక్టర్

పెద్దపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రజలు సొంత అవసరాలకు జిల్లాలో గుర్తించిన ఆరు ఇసుక రీచ్‌ల నుంచి సీనరేజీ, పన్నులు చెల్లింపులు లేకుండా ఉచితంగా ఇసుక సరఫరా చేయనున్నామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశం నిర్వహించి నూతన ఇసుక పాలసీ ఆమోదించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 16నుంచి సుల్తానాబాద్‌లోని నీరుకుల్ల, గట్టెపల్లి, ముత్తారంలోని ముత్తారం, అడవిశ్రీరాంపూర్, మంథనిలోని విలోచవరం, అంతర్గాంలోని గోలివాడ ఇసుక రీచ్‌లలో ఎక్కడి నుంచైనా ట్రాక్టర్లలో ఇసుక తీసుకోవచ్చన్నారు. ఇసుక రీచ్‌ల నుంచి ఉచితంగా తీసుకునే ఇసుక సొంత అవసరాలకు మాత్రమే వాడాలని, జిల్లా పరిధిలో మాత్రమే వాడాలని, ఎక్కడా ఇసుక డంప్‌లు సృష్టించడానికి వీలు లేదన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ఇసుక తరలించాలని, సాయంత్రం 5 తరువాత ఇసుక తరలిస్తే వాహనాలను సీజ్ చేసి జరిమానా విధిస్తామన్నారు. ట్రాక్టర్ ఇసుక పెద్దపల్లి పట్టణలో రూ.1400, సుల్తానాబాద్‌లో రూ.1000, జూలపల్లిలో రూ.1700, ఓదెలలో రూ.1150, శ్రీరాంపూర్‌లో రూ.1100, పాలకుర్తిలో రూ.2500, అంతర్గాంలో రూ.1000, రామగుండంలో రూ.2600, మంథని రూ.1500, ధర్మారంలో రూ.2300, కమాన్‌పూర్‌లో రూ.2200, రామగిరిలో 2200 రూపాయలకు విక్రయించాలన్నారు. నిర్ణీత ధరకంటే అధికాంగా విక్రయిస్తే 08728 223318,08728 223310 ఫోన్ నంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు.

మండల ప్రజా పరిషత్ కార్యాలయం తనిఖీ

రామగిరి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రామగిరి మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని బుధవారం జిల్లా పరిషత్ సీఈవో నరేందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో జిల్లా పరిషత్ నిధులతో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయంలోని వివిధ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శైలజారాణి, సూపరింటెండెంట్ ఉమేశ్, సిబ్బంది పాలొన్నారు.

రోడ్డు పక్కన వ్యర్థాలు.. తప్పని ఇబ్బందులు



రోడ్డు పక్కన పడేసిన చెత్త

ధర్మారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని దుకాణాదారులు షాపుల్లోని వ్యర్థాలను రోడ్లపై పడేస్తున్నారు. ముఖ్యంగా బేకరీ యజమానులు చెత్తను మల్లన్నగుట్ట సమీపంలో రోడ్డుకు ఇరువైపులా పడేస్తున్నారు. గాలికి చెత్తంతా రోడ్లపై చెల్లాచెదురవడంతో పాటు అందులోని వ్యర్థాలు కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ధర్మారం నుంచి ఎండపల్లి ఎక్స్‌రోడ్ మీదుగా జగిత్యాల వెళ్లే ప్రయాణికులతోపాటు ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

పరిసర ప్రాంతాలపై ఆర్ఎఫ్‌సీఎల్ నిర్లక్ష్యం..

వీర్లపల్లికి పునరావాసం కల్పించాలి...

సీఈవో ఆలోక్ సింఘాల్‌తో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



ఆర్ఎఫ్‌సీఎల్ సీఈవో ఆలోక్ సింఘాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం ప్రభావిత, పరిసర ప్రాంతాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, స్థానికులకు ఉపాధి కల్పించడం లేదంటూ ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆర్ఎఫ్‌సీఎల్ సీఈవో అలోక్ సంఘాల్‌తో ఫ్‌సీఎల్ గెస్ట్‌హౌస్‌లో భేటీ అయిన ఆయన పలు అంశాలపై చర్చించారు. కేంద్రంలో యూపీఏ ప్రభుత్వ హయాంలో ఎఫ్‌సీఐని పునరుద్ధరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమల వల్ల వీర్లపల్లి శబ్ద, వాయు కాలుష్యంతో ఇబ్బంది పడుతుందని, వెంటనే ఆ గ్రామాన్ని తరలించి పునరావాసం కల్పించాలన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి వెలువడే అమ్మోనియాతో గోదావరిఖనిలోని విఠల్‌నగర్, తిలక్‌నగర్, చంద్రశేఖర్ నగర్, శాంతినగర్, లక్ష్మీపురం ప్రాంతాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, నీటిని శుద్ధి చేయకుండానే కాలుష్య జలాలను డ్రైన్లలోకి, గోదావరిలోకి వదులుతున్నారన్నారు. జెడ్ఎల్‌డీ నిర్మాణం చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఇన్నాళ్లు రైతాంగాన్ని దృష్టిలో ఉంచుకుని పరిశ్రమకు సహకరించామని, కానీ యాజమాన్యం పరిసర ప్రాంతాలు, ప్రభావితాలను నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఇది గర్హనీయమని, వైఖరి మారకపోతే తిరుగబడుతామన్నారు. స్థానికులకు ఉపాధి కల్పించడంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, గతంలో హమాలీ పనులను అమ్ముకునేందుకు సహకరించి కార్మికుల ప్రాణాలు పోయేలా చేశారని, ఇప్పుడు ప్రభావిత గ్రామాలైన ఎల్కలపల్లి వారికి పనులు ఇవ్వమంటే కూడా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పరిసర గ్రామాలు, డివిజన్లలో పారిశుధ్యం, మంచినీటి సరఫరా కల్పించాల్సిన బాధ్యత సంస్థపై ఉందన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో యూరియాకు వినియోగిస్తున్న బ్యాగులను గుజరాత్ నుంచి తెప్పిస్తున్నారని, స్థానికంగా తీసుకునేలా చర్యలు చేపట్టాలని, తద్వారా అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు. స్థానిక లారీలకు లోడింగ్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే లోడింగ్‌లు ఇవ్వాలన్నారు.

ఈ సమావేశంలో మేయర్ అనీల్ కుమార్, ఏసీపీ మడత రమేష్, ఆర్ఎఫ్‌సీఎల్ డీజీఎం(హెచ్ఆర్) సోమనాథ్, అధికారులు అజయ్, మయాంక్, కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్, దీటి బాలరాజు, కొక్కిరాల శ్రీనివాసరావు, పాండు రంగారావు, లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

ఫైటింక్లయిన్‌కాలనీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగ్గాలేక కాలనీలోని రాజీవ్‌నగర్ తండాకు చెందిన లవుడ్య దేవయ్య(65) మంగళవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దేవయ్య భార్య శాంతమ్మ రెండేళ్ల క్రితం మరణించగా, పెద్దకుమారుడు రాజేష్ వద్ద ఉంటున్నాడు. భార్య మరణం తర్వాత మద్యానికి బానిసై మానసిక స్థితిని కోల్పోయాడు. మంగళవారం రాత్రి అందరూ పడుకున్నాక ఇంటి ఆవరణలో ఉరివేసుకున్నాడు. బుధవారం తెల్లవారు జామును కుటుంబ సభ్యులు గమనించేసరికి మృతిచెంది ఉన్నాడు. మృతుడికి ముగ్గురు కుమారులు. పెద్దకుమారుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● హైదరాబాద్‌లో ఎల్లారెడ్డిపేట యువకుడు..


సిరిగాధ మనోహర్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రెండు నెలల క్రితం తాత అనారోగ్యంతో మరణించడంతో తట్టుకోలేని మనువడు మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన సిరిగాధ మనోహర్(25) చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అతడి తల్లిదండ్రులు హైదరాబాద్‌లో నివాసముంటారు. మనోహర్‌కు ఎల్లారెడ్డిపేటలో ఉండే తాత రామచంద్రంతో మంచి అనుబంధం ఉండేది. రామచంద్రం రెండు నెలల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. తాత మరణం తట్టుకోలేక మనోహర్ మానసికంగా కుంగిపోయాడు. అప్పటి నుంచి హైదరాబాద్‌లో తల్లిదండ్రులతో కలిసి ఉంటూ వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో భోజనం చేసి తన గదిలో నిద్రకు ఉపక్రమించాడు. తాత లేని జీవితం ఎందుకని మనస్తాపం చెందిన మనోహర్ గదిలో ఉరివేసుకుని మృతి చెందాడు. బుధవారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామమైన ఎల్లారెడ్డిపేటకు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

ఎస్సారెస్పీ కాలువలో మహిళ మృతదేహం


దూలం సరోజన (ఫైల్)

హుజూరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువలో ఓ మహిళ మృతదేహం బుధవారం లభ్యమైంది. స్థానికుల కథనం ప్రకారం ఎస్సారెస్పీ కాలువలో మహిళ మృతదేహం కొట్టుకు వస్తుండగా గమనించిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని మహిళ మృతదేహాన్ని పోలీస్, అగ్నిమాపక సిబ్బంది ఒడ్డుకు చేర్చారు. మృతురాలి వివరాలు ఆరా తీయగా హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన దూలం సరోజన (68)గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతికి గల వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్టు

పెగడపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయించిన అనక సురేష్ అనే వ్యక్తిని అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు మల్యాల సీఐ నీలం రవి తెలిపారు. పెగడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరెస్టు వివరాలు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 5న కిలో గంజాయితో నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఇంద్రవెల్లి మండలం బొప్పాపూర్ గ్రామానికి అనక సురేష్ వద్ద నుంచి కొనుగోలు చేసినట్లుగా తెలిపారు. ఈ మేరకు పెగడపల్లి ఎస్ఐ రవికిరణ్ ఆధ్వర్యంలో అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో సీఐతో పాటు పెగడపల్లి ఎస్ఐ రవికిరణ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ట్రాలీ ఆటో బోల్తా...
12మంది మహిళలకు తీవ్ర గాయాలు

హుజూరాబాద్ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మండలంలోని ధర్మరాజుపల్లి స్టేజీ వద్ద బుధవారం ఉదయం ట్రాలీ ఆటో బోల్తా పడి 12 మంది మహిళలు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ కూలీ పనులు వెళ్లేందుకు మహిళలు ఆటోలో ఎక్కగా, ధర్మరాజుపల్లి స్టేజీ వద్ద ఆటో అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న 12మందికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కలిసే ఉంటాం.. విభజించొద్దు..

● కలెక్టర్ కార్యాలయం ఎదుట బతికెపల్లి ప్రజల నిరసన

● పోలీసుల జోక్యంతో ఆందోళన విరమణ


కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజలు

జగిత్యాల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా కలిసి ఉంటున్నామని, ఇప్పుడు కూడా తామంతా కలిసే ఉంటామని, తమను గ్రామం నుంచి వేరు చేయవద్దని బతికెపెల్లికి చెందిన గ్రామస్థులు తమ ఆవేదనను నిరసన రూపంలో తెలుపుతూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. పెగడపల్లి మండలం బతికెగ్రామంలో మొత్తం 14 వార్డులు ఉన్నాయి. ఓ కులానికి చెందిన తామంతా ఉంటున్న రెండు వార్డులను కలిపి ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేస్తామన్న విషయంపై ఆ రెండు వార్డులైన కొండయ్యపల్లి, పుల్లయ్యపల్లి వార్డులకు చెందిన ప్రజలు, యువకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకొని మహిళలు, గ్రామస్థులు ధర్నా చేపట్టారు. ఆ వార్డులకు చెందిన యువకులు వాటర్ ట్యాంక్ ఎక్కి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్లుగా బతికెపల్లి గ్రామంగా ఉంటున్న తమను ఆ గ్రామం నుంచి కేవలం తమకు చెందిన వార్డులను విభజించడం వెనుక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. కేవలం స్వార్థరాజకీయాల కోసమే ఇలాంటి గందరగోళానికి తెరలేపారని విమర్శించారు. తమ గ్రామాన్ని విభజించవద్దని ప్రజాప్రతినిధులకు విన్నవించినా, ప్రజావాణిలో వినతిపత్రం అందించిన ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఓ ప్రజాప్రతినిధి అండతోనే తమకు అనుకూలంగా ఉండే వారిని ఓ గ్రామంగా, లేరని భావించే వారిని మరో గ్రామంగా విభజించి, రాజకీయంగా లబ్ధిపొందేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన తెలుపుతున్న గ్రామస్థులను, వాటర్ ట్యాంకు ఎక్కిన యువకులను పోలీసులు సముదాయించి ఆందోళన విరమింపజేశారు. రూరల్ సీఐ కృష్ణారెడ్డి, టౌన్ ఎస్సై కిరణ్‌కుమార్‌తో పాటు పోలీసుల జోక్యంతో ఆందోళన సద్దుమణిగింది. ఈ నిరసనలో కొండయ్యపల్లి, పుల్లయ్యపల్లి చెందిన ప్రజలు పాల్గొన్నారు.

అనాథలైన చిన్నారులు

● నాడు తల్లి..నేడు తండ్రి మృతి


తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు

మానకొండూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు ఇద్దరూ మృతి చెందడంతో చిన్నారులు అనాథలయ్యారు. మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన బండారి రేణుక-వెంకటేశ్ దంపతులకు కుమార్తె వర్షిణి, కుమారుడు సాయిచరణ్‌లు జన్మించారు. వెంకటేశ్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రెండేళ్ల క్రితం రేణుక అనారోగ్యంతో మృతి చెందగా అప్పటి నుంచి వెంకటేశ్ ఇద్దరు పిల్లలను సాకుతున్నారు. కొన్ని రోజుల క్రితం వెంకటేశ్ అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం పలు ఆసుపత్రులలో వైద్యం చేయించినా నయం కాలేదు. బుధవారం రాత్రి వెంకటేశ్ మృతి చెందాడు. దీంతో ఇద్దరు చిన్నారులు తండ్రి మృతదేహం వద్ద విలపిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. తల్లిదండ్రులు మృతి చెందడంతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారారు. వర్షిణి కరీంనగర్‌లోని హాస్టల్‌లో ఉంటూ 7వ తరగతి చదువుకుంటుండగా, సాయిచరణ్ మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు.

కొత్తపల్లి శివాలయంలో ఎమ్మెల్సీ కవిత పూజలు


కొత్తపల్లి శివాలయంలోపూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కవిత

భగత్‌నగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం కొత్తపల్లి పట్టణంలోని పురాతన శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపల్లిలో ఒకరి జన్మదినోత్సవానికి హాజరైన కవిత శివాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● రహదారులపై డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు ఏవి?

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించడానికి ఏర్పాటు చేసిన 'బ్రీత్ ఎనలైజర్'లను కూడా పోలీసులు ప్రధాన రహదారులపై వినియోగించకుండా నగరాలు, పట్టణాల్లో మాత్రమే ఉపయోగిస్తూ విమర్శల పాలవుతున్నారు. రాజీవ్‌రహదారి, ఇతర ప్రధాన రోడ్లపై మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తున్న డ్రైవర్లు ప్రమాదాలు చేసి ప్రజల ప్రాణాలను బలితీసుకుంటున్నారు. ఇసుక, గ్రానైట్ ఓవర్ లోడ్‌లపై ఆర్టీఏ అధికారులు, పోలీసులు పట్టించుకోక పోవడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. జిల్లాలో తరచుగా జరుగుతున్న 82 ప్రమాద స్థలాలను అధికారులు గుర్తించి 68 చోట్ల నియంత్రణ చర్యలు తీసుకున్నట్లుగా ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా అధికారులు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా



2023లో జరిగిన రోడ్డు ప్రమాదాలు జరగగా 203 మంది మృత్యువాత పడ్డారు. మరో 600పైగా గాయపడ్డారు. 2024లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 184 మంది మృత్యువాత పడ్డారు. మరో 600 వరకు గాయపడ్డారు.

● బర్నింగ్ ఇష్యూ

రహదారులపై మృత్యుఘోష



- అవగాహన కార్యక్రమాలకే పరిమితం
- ఏడాదిలో రోడ్డు ప్రమాదాల్లో 184 మంది మృత్యువాత
- మద్యం మత్తులో డ్రైవింగ్‌తోనే అధిక ప్రమాదాలు
- ఓవర్‌లోడ్‌పై చర్యలు కరువు

కరీంనగర్ క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు కీలకమైన రాజీవ్‌రహదారితోపాటు పలు రోడ్లు రక్తసిక్తమవుతున్నాయి. వాహనదారుల నిర్లక్ష్యానికి అమాయకులు బలవుతున్నారు. రాజీవ్ రహదారితో పాటు రోడ్లపై దాబాలు, హోటళ్లలో అక్రమంగా మద్యం సిట్టింగ్‌లు నడుస్తున్నాయి.



అన్ని గ్రామాల్లో రేషన్ షాపులకు రెట్టింపుగా బెల్ట్‌షాపులు, దాబాలు నడుస్తున్నాయి. ఈ హోటళ్లు, దాబాల్లో వాహనదారులు మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్లనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గత సంఘటనల్లో పోలీసుల విచారణ సందర్భంగా స్పష్టమైంది. మద్యం బెల్ట్‌షాపులు, దాబాల్లో మద్యం సిట్టింగ్‌లపై పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఎలాంటి నియంత్రణ చర్యలు చేపట్టడం లేదు. ప్రధాన రహదారులపై ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన హైవే గస్తీ బృందం జాడే లేదు. గతంలో హైవే పోలీసు పెట్రోలింగ్ వాహనాలను ఏర్పాటు చేసిన తరువాత ఎత్తేసింది. ప్రమాదాలు తగ్గించడానికి జనవరి 31 వరకు జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని రోడ్ల పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి' కథనం..

ప్రమాదాల వివరాలు

సంవత్సరం	మృతులు	క్షతగాత్రులు
2023	203	600
2024	184	600

రోడ్డు ప్రమాదాలపై సమీక్షలు జరుపుతూ, నివారణకు చర్యలు తీసుకోవాలంటూ ప్రతి ఏటా జాతీయ రహదారుల భద్రతా మాసోత్సవాలు సందర్భంగా పోలీసు, ఆర్టీఏ, ఆర్అండ్‌బీ తదితర ప్రభుత్వ శాఖల అధికారులు ఆనవాయితీగా సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు ప్రమాదాల నివారణకు నిర్దిష్టమైన చర్యలు తీసుకోవటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని ప్రధాన రహదారులు, రోడ్లపై 82 డేంజర్ జోన్‌లను అధికారులు గుర్తించారు. ఈ డేంజర్ జోన్‌లలో తరచూ ప్రమాదాలు జరుగుతూ అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం..

కంచి వేణు, రవాణాశాఖాధికారి, హుజూరాబాద్..



ఆర్టీఏ కార్యాలయానికి లైసెన్స్ కోసం వచ్చే ప్రతి ఒక్కరికి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగిస్తున్నాం. ప్రతి వాహనానికి ఫిట్‌నెస్ సక్రమంగా ఉందా లేదా అనేది చూసుకోవాలి. ఈ నెలరోజుల పాటు ఆటో, ఆర్టీసీ అన్ని వాహనాల డ్రైవర్లకు అవగాహన కల్పిస్తాం. ఏకగ్రాతతో వాహనాలను నడిపితే ప్రమాదాలను తగ్గించొచ్చు. వాహనాలకు లైసెన్స్‌లు, ఇతర పత్రాలుంటేనే రహదారిపై అనుమతిస్తాం.

● ప్రమాదకరంగా రాజీవన్ రహదారి

నాలుగు వరుసలతో స్టేట్ హైవే-1గా రాజీవ్ రహదారి నిర్మించినప్పటికీ మూల మలుపులు సరిచేయక పోవడంతోపాటు గ్రామాల వద్ద ఓవర్, అండర్ బ్రిడ్జిల నిర్మాణాలు, పూర్తిగా చేపట్టకపోవడంతో ప్రమాదకరంగా తయారయింది. గ్రామాల వద్ద సర్వీస్ రోడ్ల స్థానంలో గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. రాజీవ్‌రహదారితో జిల్లాకు రవాణా సౌకర్యాలు మెరుగవుతా



యని ఆశించిన ప్రజలకు ప్రమాదాలు పెరగడంతో ఆందోళన వ్యక్తమవుతున్నది. వాహనాల ఓవర్‌స్పీడ్, డ్రంకెన్ డ్రైవ్‌లతో రాజీవ్ రహదారి పొడుగునా నిత్యం ఏదో ఒక చోట ప్రమాద సంఘటన జరుగుతూ అమాయకులు మృత్యువాత పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని బెజ్జంకి మండలం రేగులపల్లి నుంచి గోదావరిఖని వరకు రోడ్డును ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజల రాకపోకలకు, రోడ్డు దాటేందుకు ప్రత్యేకంగా ఓవర్ బిడ్జి, అండర్ బ్రిడ్జిలు నిర్మించకుండా కేవలం చిన్న దారితో గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. దీంతో రోడ్డు దాటుతున్న సందర్భాల్లో తరచుగా పాదచారులు, వాహనదారులు ప్రమాదాలబారినపడి చనిపోతున్నారు.

● ఇష్టారాజ్యంగా ఓవర్‌లోడ్....

కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలోని ఇసుక క్వారీలు, గ్రానైట్ క్వారీల నుంచి ఓవర్‌లోడ్‌తో ఇసుక, గ్రానైట్ హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు నిత్యం వందల సంఖ్యలో లారీలు నడుస్తున్నాయి. దీంతో రహదారిపై వాహనాల రాకపోలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రమాదాలు జరుగుతున్నాయి.



డేంజర్ జోన్..

● తరచూ ప్రమాదాలు జరుగుతున్నా నివారణ చర్యలు శూన్యం


హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లి గ్రామంలో కరీంనగర్-వరంగల్ ప్రదార రహదారిపై తరుచూ ప్రమాదాలు జరిగే స్థలం

హుజూరాబాద్‌రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అతివేగం... నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. హుజూరాబాద్ పట్టణం మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి ఎన్‌హెచ్-163 కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై వారంలో కచ్చితంగా మూడు, నాలుగు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. హుజూరాబాద్ పట్టణం మీదుగా వెళ్తున్న జాతీయ రహదారిపై, జమ్మికుంట, పర్కాల్ వెళ్లే ప్రధాన రహదారిపై అత్యంత ప్రమాదకర ప్రాంతాలను అధికారులు గుర్తించారు. ముఖ్యంగా పట్టణంలోని కేసీ క్యాంపు శివారులోని పర్కాల్ క్రాస్ రోడ్డు వద్ద నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటుగా, తుమ్మనపల్లి, సింగాపూర్, లింగాపూర్ క్రాస్, కొత్తగట్టు క్రాస్‌ల వద్ద ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. జమ్మికుంట ప్రధాన రహదారిపై చెల్పూర్, రంగాపూర్, శాలపల్లి-ఇందిరానగర్ గ్రామాల్లోని క్రాసింగ్ వద్ద వాహనాలు అదుపు తప్పుతున్నాయి.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బుధవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. ఓ వైపు రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తుండగానే వరుసగా ప్రమాదాలు జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

● చెట్టును ఢీకొన్న లారీ.. డ్రైవర్ మృతి..

హుజూరాబాద్ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మండలం మాందాడిపల్లి గ్రామ సమీపంలో బుధవారం తెల్లవారు జామున ఓ లారీ అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా వీర్లపాడు మండలానికి చెందిన గుజ్జుల శివారెడ్డి (48) ఏపీ39యూ4969 అనే లారీలో పొగాకు లోడు చేసుకొని ఎన్టీఆర్ జిల్లా కంచకర్ల నుంచి గుజరాత్ రాష్ట్రంలోని ఆనంద్‌కు వెళ్లడానికి మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు క్లీనర్ బాబులుతో బయలుదేరాడు. కొద్ది దూరం వచ్చిన తర్వాత డ్రైవర్ శివారెడ్డి పక్కన కూర్చుని క్లీనర్ బాబులుతో డ్రైవింగ్ చేయించాడు. హుజూరాబాద్ మండలం మాందాడిపల్లి వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో శివారెడ్డి లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ నడుపుతున్న షేక్ బాబులుకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో అతడిని హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శివారెడ్డి సోదరుడు గుజ్జుల వెంకటేశ్వర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

● కుక్క అడ్డం రావడంతో ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి

కాల్వశ్రీరాంపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కుక్క అడ్డం రావడంతో ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతిచెందిన సంఘటన మండలంలోని మంగపేట శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంటకు చెందిన ఆటో డ్రైవర్ చొక్కారపు శ్రీనివాస్(62) తన ఆటో నంబరు టీఎస్ 22టీ7240 లో బుధవారం జమ్మికుంట నుంచి పెద్దపల్లికి ఇద్దరు ప్రయాణికులతో వెళ్తుండగా మంగపేట శివారులో రోడ్డుపై హఠాత్తుగా కుక్క అడ్డం రావడంతో ఆటో బోల్తాపడింది. డ్రైవర్ చొక్కారపు శ్రీనివాస్ తల, కాళ్లు, చేతులకు తీవ్రగాయాలు కావడంతో 108లో కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న రాజమల్లు, భాగ్యలక్ష్మికి గాయాలు కాగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మాందాడిపల్లిలో చెట్టును ఢీ కొట్టిన లారీ, గుజ్జుల శివారెడ్డి (ఫైల్)

● ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడు ..

తంగళ్లపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి మండెపల్లి గ్రామానికి చెందిన సూరకాని మణితేజ (23) అనే యువకుడ మృతిచెందాడు. బుధవారం మండెపల్లి నుంచి మణితేజ ద్విచక్రవాహనంపై తంగళ్లపల్లికి వస్తుండగా ఓ ఫంక్షన్‌హాల్ ఎదుట గల మూలమలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి స్తంభానికి ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య రాధిక, రెండేళ్ల కుమారుడు రిషివర్ధన్ ఉన్నారు. ఈ సంఘటనలపై పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

● టిప్పర్‌ను ఢీ కొని..


బాదావత్‌రాజు మృతదేహం

మేడిపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డుకు అడ్డంగా నిలిపి ఉన్న టిప్పర్‌ను ఢీ కొని ఓ ద్విచక్రవాహన దారుడు బుధవారం మృతి చెందాడు. పసునూర్ గ్రామానికి చెందిన బాదావత్ రాజు(29) మంగళవారం రాత్రి తన మిత్రుడిని కలవడానికి హైదరాబాద్‌కు వెళ్లేందుకు తన ద్విచక్ర వాహనంపై పసునూర్ నుంచి జగిత్యాలకు బయలు దేరాడు. కొండాపూర్ గ్రామ శివారులో గల వైష్ణవి సూపర్ మార్కెటు వద్ద ట్రాఫిక్ నిబంధనల పాటించకుండా నిలిపి ఉంచిన టిప్పర్‌ను రాజు తన ద్విచక్ర వాహనంతో వెనుక వైపు నుంచి ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం ఉదయం మృతి చెందాడు. రాజు భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మెరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.

సత్వరమే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు

- టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ. ఎం. రమేష్‌బాబు



గణేశ్‌నగర్,జనవరి 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముక అయిన రైతులకు యుద్ధప్రాతిపదికన వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నట్లు కరీంనగర్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం. రమేష్‌బాబు తెలిపారు. బుధవారం జిల్లా సర్కిల్ కార్యాలయంలో విద్యుత్ అధికారుల సమావేశంలో మాట్లాడారు. గత ఏడాది 1204 సర్వీసులను మంజూరు చేశామని తెలిపారు. ఒక డిసెంబర్ నెలలోనే దాదాపు160 సర్వీసుల మంజూరు చేశామని తెలిపారు. 2023 సంవత్సరంతో పోల్చుకుంటే దాదాపు 30 శాతం పెరిగిందని అన్నారు. వ్యవసాయ సర్వీసుల మంజూరు ఆన్‌లైన్ చేయ డంతో వేగంగా పనులు అవుతున్నా యన్నారు. అలాగే ఈ- స్టోర్స్ విధానం ప్రవేశ పెట్టడం ద్వారా కావాల్సిన మెటీరియల్‌ను ఆన్‌లైన్ ద్వారా రిజర్వ్ చేసుకొని కావాల్సిన సమయంలో తీసుకుని పనులు ప్రారంభించవచ్చ న్నారు. విద్యుత్ అధికారులు రైతులకు మరింత చేరువై వారి సమస్యలను పరిష్కరించే దిశగా పొలంబాటు కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు.

సై..సై.. సైకిల్ సవారీ..


మానేరు డ్యాంపై సైక్లిస్టులు

- ఆరోగ్యంతోపాటు ఆనందం
- లాభాలపై అవగాహన కల్పిస్తున్న రన్నర్స్, సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు సైకిల్ అంటే క్రేజ్ ఉండేది.. కాలేజీ కుర్రవాడి నుంచి ఉద్యోగి వరకు సైకిల్ ఉపయోగించేవారు. కాలం మారింది.. సైకిల్ స్థానాన్ని కార్లు, బైక్‌లు ఆక్రమించాయి. సైక్లింగ్ ఒక మంచి వ్యాయామంగా ఉపయోగపడుతుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సైకిల్‌పై అవగాహన కల్పించేందుకు, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు రన్నర్స్, సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు. ఉరుకుల పరుగుల జీవితంలో శరీరానికి అలసట లేకుండా పోయి ఒత్తిడితో కూడిన జీవనం సాగిస్తున్నారు నగరవాసులు. అలాంటి అలవాట్లను మార్చే ఉద్దేశంతో ప్రజల ఆరోగ్య విషయాలపై అవగాహన కలిగించేందుకు వారంలో కనీసం నాలుగు రోజులైనా వాకింగ్, జాగింగ్, రన్నింగ్, సైక్లింగ్‌తో శరీరాన్ని కదిపితే లెక్కకు మించిన ప్రయోజనాలు పొందుతారని సైక్లింగ్ అసోసియేషన్ సభ్యులు తెలుపుతున్నారు. సైక్లింగ్ వల్ల ఊపిరితిత్తులు కూడా బాగా పనిచేస్తాయి. శారీరక, మానసిక ఆరోగ్యానికి సైక్లింగ్ ఉపయోగపడుతుంది. సైక్లింగ్ సంఘ సభ్యులు సైకిల్‌పై వందల కిలోమీటర్ల ప్రయాణిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ అసోసియేషన్ 2009లో ప్రారంభమైంది. ఐదుగురు సభ్యులతో ప్రారంభమైన అసోసియేషన్‌లో ప్రస్తుతం వంద మంది సభ్యులు ఉన్నారు.

- సమాజహిత కార్యక్రమాలు....

జిల్లా పాలన యంత్రాంగం సహకారంతో మారథాన్ మొదటి ఎడిషన్ నిర్వహించారు. ఇటీవల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం నుంచి రెండో ఎడిషన్ నిర్వహించారు. మహిళా దినోత్సవం నాడు 5కే రన్‌ను నిర్వహించారు. ఇందులో వెయ్యి మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. డిసెంబరు 16 విజయ్ దివస్‌ను పురస్కరించుకొని సికింద్రాబాద్ నుంచి కరీంనగర్ వరకు 150 కిలోమీటర్ల సైకిల్ రైడ్‌ను నిర్వహించారు.



సైక్లింగ్ నిత్య జీవితంలో భాగమైంది...

- ఉడుతల పద్మావతి, డీడీ మార్కెటింగ్

సైక్లిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించాం. నిత్య జీవితంలో సైక్లింగ్ ఒక భాగమైంది. కొన్ని సంవత్సరాలుగా ఉదయంపూట సైక్లింగ్ చేస్తున్నాను. సైక్లింగ్ మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది .



హెల్దీ కరీంనగర్‌గా మారుస్తాం..

- పసుల మహేష్, రన్నర్స్ సైక్లిస్ట్ సంఘ అధ్యక్షుడు

కరీంనగర్‌ను హెల్దీ కరీంనగర్.. వెల్దీ కరీంనగర్‌గా మార్చాలన్నది రన్నర్స్ అండ్ సైక్లిస్ట్ అసోసియేషన్ ముఖ్య లక్ష్యం. సైక్లింగ్‌తో ఆరోగ్యం మానసిక ప్రశాంతత లభిస్తుంది.



గుండెకు మంచి వ్యాయామం

- డాక్టర్ అజయ్ ఖండల్

రన్నర్స్ అండ్ సైక్లిస్ట్ అసోసియేషన్‌లో సభ్యుడు కావడం నా అదృష్టం. గుండెకు అవసరమైన వ్యాయామం సైక్లింగ్‌తో లభిస్తుంది. నిత్య సైక్లింగ్‌తో పొట్ట తగ్గి ఆరోగ్యంగా ఉంటారు. సైక్లింగ్‌తో అన్ని రుగ్మతలు దూరమవుతాయి.



సైక్లింగ్ నిత్య జీవితంలో భాగమైంది...

- చల్మెడ వెంకటేశ్వర్‌రావు, సంఘ సభ్యుడు

ప్రతిరోజు కొన్ని కిలోమీటర్లు దూరం సైకిల్ తొక్కే వారిలో శారీరక పటుత్వం శక్తి పెంపొందుతాయి. దీంతో నిత్యం రెట్టింపు శక్తి సామర్థ్యాలతో పనిచేయగలుగుతారు. కాళ్ల కండరాలు గట్టిపడతాయి. సైక్లింగ్ చేస్తున్న ఫలితంగా బరువు తగ్గుతున్న.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

- కరీంనగర్ సైబర్ క్రైం డీఎస్పీ నర్సింహారెడ్డి

కరీంనగర్ క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతు న్నందున వాటి కట్టడికి ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కరీంనగర్ సైబర్ క్రైం డీఎస్పీ నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని సవరన్ స్ట్రీట్‌లోగల మహిళా జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు వారి నేరం చేసే విధానం మార్చు తూ ప్రజలను మోసం చేస్తూ ఖాతాల్లో ఉండే డబ్బును చోరీ చేస్తున్నారని, బాధితుల్లో ఎక్కువ మంది అవగాహన లేక వ్యక్తిగత సమాచారం అందించి మోసపోయిన వారే ఉన్నారని అన్నారు. సోషల్ మీడియా ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, స్నాప్‌చాట్‌లాంటి సాధనతో ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు సందేశాలు పంపించినట్లయితే వాటికి స్పందించవదన్నారు. మీ స్నేహితుల పేరుతో ఫొటోస్ పెట్టి డబ్బులు అడిగితే వెంటనే స్పందించకూడదని, నిర్ధారించు కున్న తర్వాతే రెస్పాండ్ కావాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 లేదా, సైబర్‌క్రైం వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళా శాల ప్రిన్సిపాల్ నిర్మల, ఇన్‌స్పెక్టర్ సునీల్, సబ్ ఇన్‌స్పెక్టర్ జ్యోత్స, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘పది’లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి..

- విద్యా శాఖ రీజనల్ డైరెక్టర్ సత్యనారాయణ


గర్రెపల్లిలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న విద్యా శాఖ రీజనల్ డైరెక్టర్ సత్యనారాయణ

సుల్తానాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యా శాఖ రీజనల్ డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని గర్రెపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి పలు సూచనలు అందజేశారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పాఠశాలలను బలోపేతం చేసే కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని, ఉపాధ్యాయులు ఇందుకు ముందుండాలన్నారు. వంద శాతం ఫలితాలు వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

రీజినల్ కోఆర్డినేటర్‌ను సస్పెండ్ చేయాలి

సుభాష్‌నగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రీజినల్ కోఆర్డినేటర్(ఆర్‌సీవో)ను సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. జిల్లా కేంద్రంలోని శర్మనగర్‌లో గల జ్యోతిబాఫూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారని ఆరోపించారు. కాంట్రాక్టరు నాణ్యమైన కూరగాయలు సరఫరా చేయలేదని ఆరోపించారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవడంతో పాటు ఆర్‌సీవోను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

మహా శివరాత్రి జాతరకు భారీ ఏర్పాట్లు

ఫిబ్రవరి 25 నుంచి 27 వరకు మహాశివరాత్రి జాతర

- పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కలెక్టర్, ఎస్పీతో కలిసి రివ్యూ మీటింగ్


రివ్యూ మీటింగ్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భక్తులకు ఇబ్బందులు కలగకుండా మహాశివరాత్రి జాతరను నిర్వహించాలని, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తో కలిసి మహాశివరాత్రి జాతర సమన్వయ సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 25 నుంచి 27 వరకు మూడు రోజులు పాటు జరిగే మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై శాఖల వారీగా రివ్యూ నిర్వాంచారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాతర నిర్వహిం చాలని, నిర్దేశించిన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గతం కంటే ఎక్కువగా వేములవా డకు 30 శాతం బస్సులను అధికంగా నడపాలని, భక్తుల రద్దీ ఆధారంగా డిపో మేనేజర్లు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ అవసరమైన రూట్‌లో అదనపు సర్వీసులు నడపాలని సూచించారు.

- అధికారులు వివిధ శాఖల మధ్య ఉన్న సమన్వయ లోపాలను పరిష్కరించుకుని పకడ్బందీగా మహాశివరాత్రి జాతర నిర్వహించేందుకు ముందుకు సాగాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధాన ఆలయం, తిప్పాపూర్ బస్టాండ్, కోరుట్ల బస్టాండు, ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ మహాశివరాత్రి జాతరను పురష్కరించుకుని రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

- మహాశివరాత్రి జాతర ప్రత్యేక కార్యక్రమాల వివరాలు..

మహాశివరాత్రి జాతర సందర్భంగా రాజన్న ఆలయంలో నిర్వహించే కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు భీమాశంకర్ శర్మ వివరించారు. ఫిబ్రవరి 25న రాత్రి 7 గంటలకు ప్రభుత్వం, రాత్రి 7.30 గంటలకు తిరుమల, తిరుపతి దేవస్థానం వారిచే పట్టు వస్త్రాల సమర్పణ ఉంటుందన్నారు. ఫిబ్రవరి 26 తెల్లవారు జామున 12 గంటల నుంచి 2.30 గంటల వరకు స్థానికులను సర్వదర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. ఉదయం 3.40 నుంచి 4.30 గంటల వరకు సుప్రభాత సేవ, ఆలయ శుద్ధి, ఉదయం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు ప్రాతఃకాల పూజ ఉంటుందన్నారు. మహాశివరాత్రి ఫిబ్రవరి 26వ తేదిన సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు శివదీక్ష స్వాముల దర్శనం, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు మహాలింగార్చన, రాత్రి 11.35 గంటలకు లింగోద్భావకాలం నందు శ్రీస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అదనపు ఎస్పీ శేషాద్రినిరెడ్డి, ఈవో వినోద్‌రెడ్డి, ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్యనారాయణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంజేపీఎస్‌ను సందర్శించిన పలువురు అధికారులు

గణేశ్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మహాత్మాజ్యోతిబాఫూలే బాలికల గురుకుల పాఠశాలను బుధవారం పలువురు అధికారులు సందర్శించారు. ప్రభుత్వ వైద్యుల బృందం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు వసతి గృహంలోనే ఉండి, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు పర్యవేక్షించారు. అస్వస్థతకు గురైన వారిలో అత్యధికులు తమ తల్లిదండ్రులతో ఇళ్లకు వెళ్లిపోగా, మిగతా వారిని వసతిగృహంలోనే విశ్రాంతి తీసుకునేలా ఏర్పాట్లు చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, వారి బంధువులు తరలివచ్చారు. విద్యార్థులకు అనారోగ్య సెలవులు తీసుకుని, తమ వెంట తీసుకెళ్లడం కనిపించింది. జరిగిన సంఘటనపై వివరాలు తెలుసుకునేందుకు సంబంధిత అధికారులు బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎంజేపీఎస్‌కు తరలి వచ్చారు. విద్యార్థుల క్షేమ సమాచారం తెల్సుకునేందుకు ఎంజేపీఎస్ ప్రాంతీయ సమన్వయాధికారికి పలుమార్లు ఫోన్ చేసినా, స్పందించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సాగుపై రైతులకు అవగాహన సదస్సు



బహుమతులు అందిస్తున్న శాస్త్రవేత్తలు

భగత్‌నగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ ఆధ్వ ర్యంలో కొత్తపల్లి మండలంలోని నాగుల మ ల్యాల దత్తత గ్రామంలో శాస్త్రవేత్తల బృందం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు, పశువైద్య సిబ్బ ంది పంట అవశేషాలను కాల్చకుండా దుక్కిలో దున్నే పద్ధతి, పెరటి తోట పెంపకం, వరిలో సమగ్ర పోషక యాజమాన్యంపై అవగాహన కల్పించారు. వరి పంటలో వచ్చే చీడపీడల నివారణ, పశువైద్యం, పంట సాగు విధా నాలపై వివరించారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి మంజులత, శాస్త్రవేత్తలు డాక్టర్ జి ఉషారాణి, డాక్టర్ మధుకర్‌రావు, రాజేంద్రప్రసాద్, నాగేందర్‌సింగ్, మండల వ్యవసాయాధికారి కృష్ణ, కోరమండల్ సిబ్బంది వారి ఉత్పదకాల గురించి వివరించారు. సంక్రాంతి సందర్భంగా మహిళా రైతులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

అసంపూర్తి పనులు.. అవస్థల పాలు

- ఆధ్వానంగా రాయికల్ మార్కెట్ యార్డు
- పాలకవర్గం లేక కరువైన పర్యవేక్షణ


అసంపూర్తిగా మార్కెట్ కమిటీ కార్యాలయం ప్రహరీ గోడ


అసంపూర్తిగా ఉన్న బెడ్ నిర్మాణాలు

రాయికల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు సేవలు అందించి పంటల ఉత్పత్తుల కొనుగోలుకు ఏర్పాటు చేసిన రాయికల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో చేపట్టిన అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. పాలకవర్గం లేక పర్యవేక్షణ కరువై బిల్లలు రాక పనులు సాగడం లేదు. ధర్మపురి వ్యవసాయ మార్కెట్‌కు ఉప కేంద్రంగా ఉన్న రాయికల్ మార్కెట్‌ను ప్రత్యేక మార్కెట్ యార్డుగా 2016లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2017లో తొలి పాలకవర్గం ఏర్పాటైంది. గత ఏడాది పూర్వ కమిటీలను రద్దు చేశారు. మళ్లీ నూతన కమిటీలను ఏర్పాటు చేయలేదు. రాయికల్ మార్కెట్ కమిటీ సుమారు ఆరు ఎకరాల్లో కొనసాగుతోంది. అందులో వ్యవసాయ మార్కెట్ కార్యాలయం, గిడ్డంగులను నిర్మించారు. రెండేళ్ల కిందట మార్కెట్ యార్డులో రూ.1.80 కోట్లతో ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణం, రూ.20 లక్షలతో మట్టి పనులు పూర్తయినప్పటికీ ప్రహరీ నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణం ఇంకా పూర్తి చేయలేదు. బిల్లులు రాక గుత్తేదారులు పనులు నిలిపివేసినట్లు తెలిసింది. యార్డులో పనులు పూర్తి కాకపోవడంతో వసతులు కరువయ్యాయి.

- ఆరుబయటే కొనుగోళ్లు

రాయికల్ మార్కెట్ యార్డులో వసతులు లేక యేటా వరిధాన్యం, మక్కలు తదితర పంటలను మార్కెట్ పక్కనే ఉన్న స్థలంలో కొనుగోలు చేస్తున్నారు. వర్షాలు కురిస్తే పంటలు తడిచి కొట్టుకుపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. మార్కెట్ యార్డుకు ఆదాయం ఉన్నా వసతులు లేకపోవడంతో మండల రైతులు అవస్థలు పడుతున్నారు. రాయికల్ మార్కెట్ కమిటీకి పాలకవర్గం ఏర్పాటు చేయడంతో పాటు నిధులు మంజూరు చేసి వసతులు కల్పించాల్సి ఉంది.

అన్ని పంటలను కొనుగోలు చేయాలి..

ఎనుగంటి నాగరాజు, రైతు, రామాజీపేట



మార్కెట్ యార్డులో అన్ని పంటలను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి. వరి, మొక్కజొన్నతో పాటు కందులు, పల్లి, నువ్వులు, ఇతర పంటలను రైతులు మార్కెట్‌లో విక్రయించలేక దళారులకు అమ్ముకుంటున్నారు. మార్కెట్ యార్డులో వసతులు కల్పించాలి.

ప్రత్యేక నిధులు కేటాయించాలి..

ఉదయశ్రీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్



మార్కెట్ యార్డులో పనులు పూర్తి కాక రైతులకు అవస్థలు తప్పడం లేదు. రూ.1.80 కోట్లతో చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలి. మార్కెట్ యార్డు ఆక్రమణకు గురి కాకుండా అన్ని వైపులా ప్రహరీ నిర్మించాలి. యార్డులో బెడ్ల నిర్మాణం ద్వారా పంటలకు రక్షణ ఉంటుంది.

పరిశోధనలు అభివృద్ధికి తోడ్పడాలి

- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

గణేశ్‌నగర్,జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కళాశాలలు పరిశోధనా కేంద్రాలుగా మారా లని, పరిశోధనలు అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. యూపీఐ చెల్లింపుల్లో భారతదేశం అగ్రగామిగా ఉందని యూపీఐ ఆలోచన ఒక చిన్న పరిశోధనా పత్రం ద్వారా పుట్టినదే అని అన్నారు. పరిశోధన ద్వారా కనుగొన్న అంశాలు వ్యాపార వాణిజ్య సామాజిక అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ అటనామస్ కళాశాల కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆర్థిక సహకారంతో, ఆచార్య కల్వకుంట రామకృష్ణ అధ్యక్షతన నిర్వహిస్తున్న ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ చాలెంజెస్ ఇన్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ మాట్లాడుతూ కళాశాలలో మరిన్ని సెమినార్లు నిర్వహిస్తామని అన్నారు. సదస్సు నిర్వహణ కార్యదర్శి డాక్టర్ ఎం మలారెడ్డి మాట్లాడుతూ రెండు రోజులు జరిగిన ఈ సదస్సులో దేశవ్యాప్తంగా సుమారు 146 మంది ఔత్సాహిక పరిశోధకులు రిజిస్ట్రేషన్ చేసుకుని పత్రసమర్పణ చేశారన్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన శాత వాహన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్ మాట్లాడుతూ విద్యా ర్థులందరూ పరిశోధనల పట్ల ఆసక్తి కనబరచాలని సూచించారు. ఎల్ఐసి సీనియర్ మేనేజర్ ఎస్‌వి ప్రసాద్‌రావు మాట్లాడారు. కాంపెల్లి అభిరామ్, డా. కంచు తిరుపతి, డా.ఆర్ కిరణ్ కుమార్, డా.ఆర్.వెల్ విజిలను ఉత్తమ పరిశోధనా పత్ర సమర్పకులుగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ పి.నితిన్, టి.రాజయ్య, వివిధ కళాశాలల పరిశోధకులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేల సత్పతి

న్యూస్ బాక్స్

ఇంటిపన్ను బకాయిలు వసూలుచేయాలి

ఎలిగేడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఇంటిపన్ను బకాయిలను వసూలు చేయాలని ఎంపీడీవో భాస్కర్‌రావు అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో పంచాయతీకార్యదర్శుల పాత్ర కీలకమన్నారు. ఇల్లులేని పేదలందరు దరఖాస్తులు చేసుకున్నారని వారందరికీ న్యాయం జరిగేలా చూడాలన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం, నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీవో ఎండి.ఆరీఫ్, ఉపాధిహామీ టీఏ రంజిత్, శ్రవణ్‌కుమార్, మహేష్ పాల్గొన్నారు.

పనుల పురోగతిపై సమీక్ష

పాలకుర్తి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం వివిధ పనుల పురోగతిపై ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో అల్లం పూర్ణచందర్‌రావు సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లసర్వే, ఇంటి పన్నుల వసూలు, వ్యాపార సముదాయాల శిస్తు వసూలు, కంపోస్ట్ షెడ్స్ నిర్వహణ, ఎంపీడబ్ల్యూ ఇన్సూరెన్స్, జీపీ డీపీ యాక్షన్‌ప్లాన్, నర్సరీల నిర్వహణ, ఈజీఎస్ పనులతోపాటు పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. ఎంపీవో ఉప్పు సుదర్శన్, ఏపీవో కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రీడా టోర్నీ

ఓదెల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనగర్తి దాసరి పద్మ హనుమయ్య హైస్కూల్ మైదానంలో ఈనెల 10 నుంచి 11 వరకు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు వలంటీర్ రేషవేణి మహేష్ తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, రన్నింగ్, షాట్‌పుట్ పోటీలు జరుగుతాయని, విజేతలుగా నిలిచిన జట్లకు నాలుగు వేల విలువగల స్పోర్ట్స్ కిట్స్, మేడల్స్ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికెట్లను అందజేస్తామని తెలిపారు. వివరాల కోసం 7993604489 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సదయ్య..

ఓదెల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొలనూర్ చర్చిలో బుధవారం పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. మండలస్థాయి పాస్టర్స్ అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా కొలనూర్‌కు చెందిన పాస్టర్ బొంగోని సదయ్య గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా హానోక్ పాల్, కార్యదర్శి స్టాన్లి, జాయింట్ కార్యదర్శిగా జేవియర్, కోశాధికారి శాంసన్‌లు ఎన్నికయ్యారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మంథని, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని వివిధ గురుకులాల్లో 5వ తరగతిలో చేరటానికి, 6 నుంచి 9వ తరగతుల్లో ఖాళీలను భర్తీ చేయటానికి ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించినట్లు స్థానిక ఎస్సీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ బుధవారం తెలిపారు. రాష్ట్రంలోని వివిధ గురుకుల పాఠశాలల్లో పై తరగతుల్లో చేరటానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

అవగాహన సదస్సు

ముత్తారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అడవి శ్రీరాంపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఓదెలు, యుగేందర్,మధుకర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఆయన అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ, డీసీపీ ఎం.చేతనతో కలిసి రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాల వినియోగం నియంత్రణపై నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రహదారి మిడిల్ వద్ద పిచ్చిమొక్కల తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. లారీలు, ట్రాక్టర్, భారీ వాహనాలు, కార్లకు ముందు వెనుక తప్పనిసరిగా 10 రోజులలో రేడియం స్టిక్కర్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజీవ్ రహదారిపై అవసరమైన చోట పోలీస్, ఆర్‌టీవో అధికారుల సమక్షంలో రంబల్ స్ట్రిప్స్ ఏర్పాటుచేయాలన్నారు. అవసరమైన చోట హైమాస్ట్ లైటింగ్ కోసం ప్రతిపాదనలు అందించాలని, టర్నింగ్ దగ్గర వెంటనే రేడియం స్టిక్కర్లతో బోర్డు ఏర్పాటుచేయాలని, మీడియన్ వద్ద ఎత్తుగా పెరిగిన మొక్కలు తొలగించాలన్నారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై విస్తృత ప్రచారం కల్పించాలని, పౌర సరఫరాల శాఖతో చర్చించి జిల్లాలో ఒక వారం పెట్రోల్ బంక్‌లలో హెల్మెట్ లేకపోతే పెట్రోల్ పోయకుండా వ్యూహాత్మకంగా అమలుచేయాలని వివరించారు. జిల్లాలోని బ్లాక్ స్పాట్స్ వద్ద స్పీడ్ లిమిట్ బోర్డులను, యాక్సిడెంట్ ప్రోన్ ఏరియా స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పాఠశాల వద్ద స్కూల్ జోన్ బోర్డులు ఉండాలన్నారు. రోడ్డుపై ట్రాక్టర్లు కేజ్ వీల్ వినియోగిస్తే వాహనం సీజ్ చేయాలని దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రమాదాలు జరిగితే దగ్గరలోని ఏ ఆసుపత్రికి తరలించాలో మ్యాపింగ్ చేయాలని తెలిపారు. జిల్లాలోని డిగ్రీ కళాశాలలు, జూనియర్ కళాశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. డ్రగ్స్‌కు బానిసలైన యువకులు, పిల్లలపై కేసులు నమోదుకాకుండా వారి భవిష్యత్తు దృష్ట్యా అవసరమైన కౌన్సిలింగ్ చేసి డీఅడిక్షన్ సెంటర్ ద్వారా డ్రగ్స్ వాడకం బానిసత్వం పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఈ బావ్ సింగ్, మంథని ఆర్డీవో సురేష్, డీఈవో మాధవి, డీడబ్ల్యూఓ., వేణుగోపాలరావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన, జిల్లా అటవీ అధికారి శివయ్య, డీఎంహెచ్‌వో డాక్టర్ అన్న ప్రసన్నకుమారి, రవాణా శాఖ అధికారులున్నారు.

సంక్రాంతి పిండి వంటల హోమ్ డెలివరీ

పెద్దపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెద్దపల్లి, గోదావరిఖని, మంథనిలోగల ఆర్టీసీ కార్గో లాజిస్టిక్స్ కౌంటర్ల నుంచి సంక్రాంతి పండుగ సందర్భంగా చేసుకునే పిండి వంటలను హైదరాబాద్‌లో ఉండే తమ పిల్లలు, బంధువులకు హోమ్ డెలివరీ చేయనున్నామని ఏటీఎం రామారావు తెలిపారు. బుధవారం ఆయన పెద్దపల్లి, గోదావరిఖని కార్గో లాజిస్టిక్స్ కౌంటర్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీజీఎస్ ఆర్టీసీ కార్గో ద్వారా ప్రజలకు అన్ని రకాల సేవలను అందిస్తున్నామని, ఇక్కడి నుంచి పంపించే పార్శిళ్లను సురక్షితంగా చేరవేస్తున్నామని తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఉండే తమ పిల్లలు, బంధువులకు పిండి వంటల పార్శిళ్లను చేరవేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట రాజు, అన్వేష్, లక్ష్మన్, లాజిస్టిక్స్ సిబ్బంది ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జిగా నరేష్..

పెద్దపల్లిటౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ పెద్దపల్లి మండల ఇన్‌చార్జిగా అంబాల నరేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా దండోరా ఉద్యమం కొనసాగిస్తామని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై సమగ్ర విచారణ


కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

జ్యోతినగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గతంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై సమగ్ర విచారణ జరిపిస్తామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ తెలిపారు. బుధవారం 2వ డివిజన్ బాట కార్యక్రమంలో సేవా స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన ఒక పేద మహిళ ఇంటి గృహ ప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో గతంలోని ప్రభుత్వం చెరువు బఫం జోన్‌లో కొన్ని ఇళ్లను కేటాయించిందని, కొంతమంది అక్రమార్కులు, రాజకీయ నాయకులు ఇందిరమ్మ ప్లాట్లను అక్రమించుకున్నారన్నారు. కాలనీలో రియల్ ఎస్టేట్ దందా చేసి నిరుపేదలకు దక్కాల్సిన ఇళ్లను అనర్హులకు అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ విషయంలో ఎంక్వయిరీ చేయాలని కలెక్టర్‌ను కోరనున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో అధికారులు, నాయకులు ఎవరున్నా జైలుకు పంపుతామని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఈ ఏడాది 3500 ఇండ్లను పేదలకు అందజేస్తామని తెలిపారు. కాగా, నిరుపేద మహిళకు ఇంటిని నిర్మించి ఇచ్చిన సేవా స్ఫూర్తి సంస్థ నిర్వాహకులు మడిపల్లి మల్లేశ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండి. ఆసీఫ్, నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా గ్రామాల అభివృద్ధికి కృషి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు


కాచాపూర్‌లో డబుల్‌రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని పొత్కపల్లిలో బుధవారం రూ.25 కోట్ల వ్యయంతో చేపట్టినున్న పొత్కపల్లి, కాల్వశ్రీరాంపూర్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ళ సుమన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిరిసేటీ రాహుల్, మాజీ ఉపసర్పంచ్ వంగ శ్రీనివాస్‌రెడ్డి, రెడ్డి రజినీకాంత్, మాజీ సర్పంచ్ డొండపాటి శ్రీనివాస్ రెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

● జూలపల్లి (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం మండల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని, ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు విమర్శించారు. మండలంలోని కాచాపూర్ నుంచి జూలపల్లి మండల కేంద్రం వరకు డబుల్‌రోడ్డు నిర్మాణానికి 19.80లక్షలు, అలాగే కాచాపూర్‌లో హెల్త్ సబ్ సెంటర్‌కు 20లక్షలు, వడుకాపూర్‌లోని పద్మశాలి కమ్యునిటీ భవన నిర్మాణానికి 5 లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో చేపట్టనున్న పనులకు బుధవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మజ, జూలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గండు సంజీవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు దారబోయిన నర్సింహయాదవ్, నాయకులు మానుమండ్ల శ్రీనివాస్, జెట్టి సతీష్, మాంకాలి అంజయ్య, చెన్నమనేని విద్యాసాగర్‌రావు, అమరగాని లింగయ్యగౌడ్, కందుకూరి అంజయ్య, బండి స్వామి, కోరికంటి మల్లయ్య, కనకట్ల నర్సింగం, వేల్పుల గట్టయ్య, చిన్నలింగయ్య, రాజు, సంపత్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘ భవనానికి శంకుస్థాపన

పెద్దపల్లిటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి పట్టణంలోని 13వ వార్డులో ఎస్‌డీఎఫ్ నిధులు 10 లక్షల రూపాయలతో బ్రాహ్మణ సంఘం భవనానికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ స్వరూప, కౌన్సిలర్ పాగాల సోని శ్రీకాంత్, పట్టణ కౌన్సిలర్లు నూగిళ్ళ మల్లయ్య, భుతగడ్డ సంపత్, బొడ్డుపల్లి శ్రీనివాస్, ధన్నాయక దామోదర్ రావు, సల్పాజి తిరుమల్‌రావు, దేవరకొండ రాజు, బ్రహ్మణులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో సంస్థాగత సందడి

(5వ పేజీ తరువాయి)

యమునా తీరేనన్నట్లుగా ఉంది. ఈ ఏడాది జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు నియోజకవర్గ ఇన్‌చార్జీకి పెద్ద సవాల్‌గా మారనున్నాయి. రామగుండం కార్పొరేషన్‌తో పాటు రెండు మండల పరిషత్‌లు ఉన్నాయి. సంధ్యారాణి పాలకుర్తి మండలం నుంచి గత ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి పోటీ చేసి జడ్పీటీసీగా గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ ఆశించినప్పటికీ టికెట్ రాలేదు. ఆమె బీజేపీలో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. పార్టీ సంస్థాగత ఎన్నికల ద్వారా పార్టీని బలోపేతం చేయాలని చూస్తున్నారు. ఈనెల 13వ తేదీలోపు, మండల, మున్సిపల్ కమిటీల అధ్యక్షుల నియామకాలు పూర్తి కానున్నాయి. ఒక్కో మండలం నుంచి పరిశీలకులు ముగ్గురు,నలుగురు పేర్లను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర పార్టీకి పంపించనున్నారు. అక్కడ ఫైనల్ కానున్నాయి. అలాగే జిల్లా అధ్యక్ష పదవికి ఐదుగురు నాయకుల పేర్లను రాష్ట్ర పార్టీకి పంపిస్తే, అక్కడినుంచి మూడు పేర్లతో జాతీయ అధ్యక్షుడికి పంపించనున్నారు. అక్కడ జిల్లా అధ్యక్షుడిని ఖరారు చేయనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. జిల్లాలో నేతల మధ్య సమన్వయం లేకపోవడంతో మండల, మున్సిపల్, జిల్లా కమిటీల అధ్యక్షుల నియామకాలు ఎలా జరగనున్నాయనే అంశం పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

గౌతమినగర్ రహదారికి వెలుగులు...

కోల్‌సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు నుంచి గౌతమినగర్‌కు వెళ్లే రహదారికి ఎట్టకేలకు వెలుగులు వచ్చాయి. చీకట్లో ప్రమాదాలు జరిగి ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. పాత అలేఖ్య థియేటర్ సమీపంలో ప్రమాదాల్లో గాయపడిన వారిని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ స్వయంగా తన వాహనంలో ఆసుపత్రికి తరలించారు. లైటింగ్‌లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొనడంతో టీయూఎఫ్‌ఐడీసీ నిధులు కేటాయించారు. పనులు కూడా పూర్తయ్యాయి. పనులు నిర్వహించిన సంబంధిత ఏజెన్సీ సెంట్రల్ లైటింగ్‌కు సంబంధించి ట్రయల్ రన్ నిర్వహించింది. నిత్యం చీకటిగా ఉండే ఈ రహదారిలో వెలుగులు విరజిమ్మడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుడుంబా విక్రయిస్తున్న మహిళ బైండోవర్

కాల్వశ్రీరాంపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాఫర్‌ఖాన్‌పేటకు చెందిన సాదవేని లక్ష్మి గుడుంబా అమ్ముతుండగా బుధవారం కేసు నమోదుచేసి తహసీల్దార్ ఎండి.వకీల్ ముందు హాజరుపరిచినట్లు ఎక్సైజ్ ఎస్సై చిరంజీవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్‌పోలీస్ సిబ్బంది రమణ, బీర్బల్, సంతోష్, సుమలత ఉన్నారు.

108 టెక్నీషియన్‌కు ప్రశంసాప్రతం


ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న సతీష్

ధర్మారం జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : 108 అంబులెన్సులో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషన్‌గా పని చేస్తున్న ఆరె సతీష్‌కు జిల్లా ఉత్తమ సేవకుడిగా గుర్తింపు లభించింది. ప్రమాదలు జరిగినప్పుడు, గర్భిణులను డెలివరీ నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తున్న అత్యవర పరిస్థితుల్లో సతీష్ స్పందించి తీరుకు నిదర్శంగా ఈ గుర్తింపు లభించింది. సతీష్‌కు జిల్లా స్టార్ ఈయంటీ ప్రశంసాపత్రాన్ని జిల్లా ఎమర్జెన్సీ మెడికల్ ఎగ్జిక్యూటివ్ కుమార్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు.

ఇందిరమ్మ మోడల్‌హౌస్‌కు ముగ్గు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం పక్కన ఇందిరమ్మ మోడల్ హౌస నిర్మాణానికి ఎంపీడీవో రామ్మోహన్‌చారి బుధవారం ముగ్గు పోశారు. ఇందిరమ్మ మోడల్ హౌస నిర్మాణాన్ని ఐదు లక్షలతో నిర్మాణం చేపట్టనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కిరణ్, ఏఈ జగదీష్, ఏపీఎం కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

'సెయింట్ జోసెఫ్'లో సైన్స్ ఫెయిర్

అంతర్గాం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రామగుండం పట్టణంలోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో టెక్నోవ-2025 పేరుతో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా రామగుండం కార్పొరేషన్ 21వ డివిజన్ కార్పొరేటర్ అమ్రిన్‌ఫాతిమా సలీంబేగ్ పాలిల్గొన్నారు. చిన్నారులు తయారుచేసిన సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్, విశ్వభారతి విద్యాసంస్థల ఎచ్‌ఎం బంధారపు తిరుపతిగౌడ్, ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, ఇన్‌చార్జి ఎచ్‌ఎం ఆశాలత, హెడ్‌మాస్టర్ నోయల్ జోసఫ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన


డిజిటల్ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దపల్లిటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణపై బుధవారం రావాణా శాఖ అధికారులు వాహనదారులకు అవగాహన కల్పించారు. పెద్దపల్లిలో డిజిటల్ స్క్రీన్ వాహనం ద్వారా రోడ్డు భద్రత నిబంధనలపై వివరించారు. ప్రమాదాలకు కారణాలను దృశ్యాల ద్వారా అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత నిబంధనలు వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని పెద్దపల్లి ఇన్‌చార్జి డీటీవో ఎస్ కె మసూద్ అలీ, ఎంవీఐ స్వప్న, ఏఎంవీఐ మధు సూచించారు. వాహనాలకు అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వాహనదారులు, రావాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో తిరుప్పావై పూజలు

సుల్తానాబాద్, జనవరి 5: (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసాన్ని పురస్కరించుకుని స్థానిక దేవాలయాల్లో బుధవారం తిరుప్పావై పాశురాల పారాయణం నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలు స్థానిక వేణుగోపాల స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో మహిళలు మంగళ హారతులతో కలిసి నగర సంకీర్తన చేశారు. తిరుప్పావై వ్రతంలో భాగంగా ప్రతీరోజు 30 పాశురాలను సామూహికంగా పారాయణం చేస్తున్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి ప్రతినిధులు పల్లా సదాలక్ష్మి, లలిత, సునిత, సుదాకర్, పొదిల్ల రమేష్, జలజ, సుభాషిణి, సుగుణ, జయమ్మ రాజ్యలక్ష్మి, కట్ట రమ, వనజ, గౌరి, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

కవితక్క సభకు అనుమతి నిరాకరణ సరికాదు..


సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

రామగిరి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కవితక్క సభకు అనుమతి నిరాకరణ సరికాదని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శంకేషి రవీందర్ అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంథని నియోజకవర్గంలో పోలీసులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని, ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని విమర్శించారు. అనుమతి అడిగితే నిరాకరిస్తారని, సమావేశమైతే అక్రమ కేసులతో వేధిస్తారని ఆరోపించారు. ఈనెల 9న జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అతిథిగా సమావేశానికి చట్టబద్ధంగా అనుమతి కోరితే పోలీసులు అనుమతి నిరకరించారని తెలిపారు. గురువారం నిర్వహించ తలపెట్టిన కవితక్క సభను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని, పోలీసులు అనుమతిచ్చినా ఇవ్వకపోయినా మరో తేదీని ప్రకటించి తెలంగాణ ఉద్యమ తల్లి విగ్రహానికి భూమిపూజ, బహిరంగసభ నిర్వహిస్తామని వెల్లడించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్, రైతు బంధు అధ్యక్షుడు మేదరబోయిన కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు కాపురబోయిన భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ దామోర శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



పెన్షన్ అదాలత్ సమస్యలపై సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జీఎం లలిత్ కుమార్

గోదావరిఖని, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సీఎంపీఎఫ్, పెన్షన్ అదాలత్ సమస్యలపై బుధవారం ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ హరి పచౌరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎస్‌సీడబ్ల్యూఏ ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ సంబంధిత సమస్యల పరిష్కార మార్గం, పెన్షన్ చెల్లింపు, పెన్షన్ సెటిల్‌మెంట్, పెన్షన్ల సవరణ, ఎన్‌సీడబ్ల్యూఏ-11 రివైజ్డ్ పెన్షన్ క్లైమ్‌లు, ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగుల సీఎంపీఎఫ్ ఆడిట్ షీట్, కాంట్రాక్టు డ్రైవర్లకు సీఎంపీఎఫ్ నెంబర్లు జారీ సమస్య, ఎగ్జిక్యూటివ్ పెన్షన్ బకాయిలు, కాంట్రాక్టు ఉద్యోగి మాస్టర్ డేటా సీ కేర్స్ పోర్టల్లో అప్‌లోడ్ సంబంధిత సమస్యల పరిష్కారం, కొత్తగా చేరిన ఉద్యోగులకు కొత్త సీఎంపీఎఫ్ కేటాయింపు, ప్రావిడెంట్ ఫండ్, ఉద్యోగుల పెన్షన్ తదితర విషయాల గురించి సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్‌కు వివరించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం గోపాల్ సింగ్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ అరెల్లి పోషం, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సీఎంఏఐ క్రాంతి కుమార్, డీజీఎం(ఫైనాన్స్) ధనలక్ష్మిబాయి, సీనియర్ పర్సనల్ అధికారులు శ్రావణ్ కుమార్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయాల్లో క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్జీ-2 జీఎం వెంకటయ్య


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు

గోదావరిఖని, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణి నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్, అధికారులు జీఎం కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఈ క్యాలెండర్‌లను ఆర్‌జీ-1 ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లలో అధికారులు, ఉద్యోగులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం గోపాల్ సింగ్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోషం, ఏరియా ఇంజనీరు దాసరి వెంకటేశ్వర్‌రావు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంట్ డీజీఎం ఆంజనేయ ప్రసాద్, ఎస్టేట్ డీజీఎం కుమారస్వామి, సివిల్ ఎస్ఇ వరప్రసాద్, సీనియర్ పర్సనల్ అధికారులు శ్రావణ్ కుమార్, హనుమంతరావు, క్రాంతి కుమార్, ఏఐటీయూసీ ప్రతినిధి రాజు పాల్గొన్నారు.

● యైటింక్లయిన్‌కాలనీ (ఆంధ్రజ్యోతి): సింగరేణి 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆర్జీ-2 జీఎం ఆఫీస్‌లో జరిగిన కార్యక్రమంలో జీఎం బండి వెంకటయ్య ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపిన జీఎం నూతన ఉత్తేజంతో ఉత్పత్తి లక్షాలను సాధించే దిశగా పనిచేయాలని కోరారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, అధికారుల సంఘం అధ్యక్షుడు, పీవో మధుసూదన్, ఏరియా ఇంజనీర్ నరసింహారావు, ఎస్వోటూ జీఎం రాముడు, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, అధికారులు రాజాజీ, సంతోష్‌కుమార్, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచిసెక్రెటరీ శ్యాంసన్ పాల్గొన్నారు.

● రామగిరి (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్‌లో సింగరేణి నూతన క్యాలెండర్‌ను ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. బుధవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరై 2025 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సింగరేణి సంస్థలోని వివిధ గనుల్లో విభాగాల్లో పని చేసే ఉద్యోగులకు అందజేస్తామని జీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎంఆర్‌సీ రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాసులు, శేఖర్‌బాబు, చంద్రశేఖర్, రాజారెడ్డి, ఐలయ్య, గుర్రం శ్రీహరితో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఓదెల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. అంతకుముందు మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం పలు పాఠశాలల కరస్పాండెంట్లను సన్మానించారు. తానిపర్తి తిరుపతిరావు, సాన్వి విద్యాసంస్థల చైర్మన్ ఎర్రం శెట్టి మునిందర్, ఎస్.వి.వి. కరస్పాండెంట్ బోడకుంట రాజేశం, గీతాంజలి కళాశాల కరస్పాండెంట్ పల్కపాటి రాజేశం, మాజీ సర్పంచ్ అంకం రమేష్, దొడ్డే శంకర్, గట్టుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● కాల్వశ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డి బుధవారం పెగడపల్లిలో పర్యటించారు. గ్రామంలో పట్టభద్రులను, క్రిసెంట్ పాఠశాల, సరస్వతి విద్యాలయంలోని ఉపాధ్యాయులను ఓటు అభ్యర్థించారు. అనంతరం నరేందర్‌రెడ్డిని పలువురు సన్మానించారు. వివిధ పోటీ పరీక్షలు రాస్తున్న వారికి స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముంజాల హరికృష్ణగౌడ్, గోపగోని మల్లేష్‌గౌడ్, టీటీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు తానిపర్తి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీకి గ్రామస్థుల సన్మానం

మంథని, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో 20 ఏళ్ళపాటు ఆర్‌ఎంపీగా వైద్య సేవలందించిన మొగిలిని గాజులపల్లి గ్రామస్థులు బుధవారం ఘనంగా సన్మానించారు. మైదుపల్లి మాజీ సర్పంచ్ తమ్మిశెట్టి కవిత-రమేష్‌ల ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పెట్టం రాజేశం, సోమారపు రమేష్, ఈసంపల్లి శ్రీనివాస్, బైశెట్టి శ్రీధర్, రాహుల్, రమేష్ పాల్గొన్నారు.

కొత్తపల్లిలో ఉచిత వైద్యశిబిరం

పెద్దపల్లి రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపల్లిలోని 9,10వ వార్డుల్లో బుధవారం సామాజిక కార్యకర్త శాంతిరాజ్, అప్పన్నపేట సెయింట్స్ ఆన్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మాత్రలను పంపిణీ చేశారు. వైద్యురాలు పియోరినా, రమ, సిస్టర్స్ హెలెన్, సుమ తదితరులు పాల్గొన్నారు.